విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

విశాఖ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది

నీతి ఆయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.వి.ఆర్.సుబ్రమణ్యం

విశాలాంధ్ర – విశాఖ: దేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖ ఒకటని నీతి ఆయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.వి.ఆర్.సుబ్రమణ్యం అన్నారు. వి.ఎం.ఆర్.డి.ఎ కార్యాల యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జి.వి.ఎం.సి., వి.ఎం.ఆర్.డి.ఎ., పరిశ్రమల శాఖ అధికారులతో వివిధ అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. నీతి ఆయోగ్ పైలెట్ సిటీలుగా ముంబాయి, సూరత్, విశాఖపట్నం, వారణాసిలను గుర్తించామన్నారు. విశాఖ జిల్లాలో ప్రకృతి పరంగా సహజవనరులతో పాటు రైల్వే కనెక్టవిటీ, పోర్టు కనెక్టవిటీలతో పాటు రాబోయే రోజులలో అంతర్జాతీయ విమానాశ్రయం కూడా విశాఖ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా విజన్ ఫర్ ఆంధ్రప్రదేశ్, సిటీ అభివృద్ధి కోసం ఆర్థిక ప్రణాళికలు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జి.వి.ఎం.సి. కమిషనర్ సాయి కాంత్ వర్మ విశాఖ అభివృద్ధి ప్రణాళికలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోస్టల్ సిటీ, సర్వీస్ సెక్టర్, టూరిజం, సిటీ ప్లానింగ్, యుసీడీ, ఎడ్యుకేషన్, పబ్లిక్ హెల్త్, ఈ గవర్నెన్స్ తదితర అంశాలపై సాధించిన ప్రగతిని తెలిపారు. రాబడి, ఖర్చులు గురించి వివరించారు. బి.ఆర్.టి.ఎస్ నెట్ వర్క్, నగర వ్యాప్తంగా మంచినీటి సరఫరా, యుజిడి వ్యవస్థపై వివరించారు. విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ఛైర్మన్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ ఒరిస్సా, తెలంగాణ, కర్ణాటకలోని కొన్ని జిల్లాలకు సంబంధించి ఎగుమతులు, దిగుమతులు ఇక్కడ నుండే జరుగుతున్నా యన్నారు. కార్గో రవాణా ఎక్కువగా చేస్తామని, జిల్లా అభివృద్ధికి తమ వంతు సహకారం ఉంటుందని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎ.పి.ఐ.ఐ.సి., మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, విజయవాడ నుండి పాల్గొన్నారు. ఈ సమావేశంలో నీతి ఆయోగ్ సభ్యులు పార్ధ సారధి, జి.వి.ఎం.సి., వి.ఎం.ఆర్.డి.ఎ., పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సిహెచ్. గణపతి, టూరిజం ఆర్ డి శ్రీనివాసరావు, సి.పి.ఓ. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రీసెర్చ్ ప్రాజెక్టు రిపోర్టులు విడుదల

విశాలాంధ్ర – విశాఖ సిటీ: ఆంధ్రవిశ్వ విద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన నాలుగు పరిశోధన ప్రాజెక్టుల రిపోర్టులను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మంగళవారం తన కార్యాలయంలో విడుదల చేశారు. యూజీసీ సహకారంతో మహిళలపై జరిపిన అధ్యయన ప్రాజెక్టుల రిపోర్టులను విడుదలచేసారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, మహిళా అధ్యయన కేంద్రం సంచాలకులు డాక్టర్ పి.ఉష, సిబ్బంది డాక్టర్ టి.సాంబశివ రావు, డాక్టర్ కె.రవి కుమార్, బి.జె కిరణ్ ప్రసాద్, సి.హెచ్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: మహా విశాఖ నగర పాలక సంస్థ పరిధిలో గల విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలలోని ఇళ్ల లేని నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు లే ఔట్‌లను పూర్తిస్థాయిలో రూ.600 కోట్ల అంచనాతో అభివృద్ధి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. ప్రభుత్వం 2020 సంవత్సరంలో భూ సమీకరణ పథకం క్రింద భూ సేకరణ చేపట్టగా అర్హులైన రైతులు సుమారు 4,900 ఎకరముల భూమిని స్వచ్ఛందంగా ప్రభుత్వమునకు అందజేసారన్నారు. భూములిచ్చిన రైతులకు వారికి నచ్చిన, కోరుకున్న లేఔట్‌లలో ల్యాండ్ పూలింగ్ ఓనర్ షిప్ సర్టిఫికేట్‌లను (ఎల్.పి.ఓ.సి) కూడా సంబంధిత కాంపిటెంట్ అథారిటీ ద్వారా మంజూరు చేయటం జరిగిందన్నారు.

మినీ గోకులం నిధుల అవకతవకలపై ఫిర్యాదు

విశాలాంధ్ర – కె.కోటపాడు: గత ప్రభుత్వంలో మంజూరు చేసిన మినీ గోకుల షెడ్ల నిధులు మంజూరుపై అవకతవకలు జరిగాయని రైతులు స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చౌడువాడ గ్రామానికి చెందిన రాపేటి ప్రసాదు, శరగడం అచ్చం నాయుడులు గత ప్రభుత్వంలో మినీ గోకులం షెడ్‌లో నిర్మాణం చేపట్టారు. ప్రస్తుత ప్రభుత్వం గత ఏడాది మొదట విడతగా రెండు ఆవుల షెడ్డు నిర్మాణానికి 29 వేల రూపాయలు, నాలుగు ఆవుల షెడ్డు నిర్మాణానికి 64000 పేమెంటు ఇచ్చారని అన్నారు. వాస్తవంగా రెండు ఆవుల షెడ్డుకు 54,000 నాలుగు ఆవుల షెడ్డుకు 85000 ఇవ్వాల్సి ఉందని అన్నారు. ఈ పేమెంట్ తేడాపై పశువర్ధక శాఖ అధికారులను, ఉపాధి హామీ అధికారులను సంప్రదించగా ఏ ఒక్కరు తమకు సరైన సమాధానం చెప్పలేదని అన్నారు. పేమెంటు తక్కువ ఇచ్చి ఎక్కువ ఇచ్చినట్లుగా అధికారులు చెప్పడంపై తాము స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

యువకుడి సాహసం... దొరికిన దొంగలు

విశాలాంధ్ర – పద్మనాభం: పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ కురపల్లి గ్రామానికి చెందిన ఒక మహిళ మెడలో బంగారు పుస్తెలతాడును ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి చోరీ చేశారు. అయితే యువకుడు బాడిదిబోయిన బంగారప్పుడు అనే యువకుడు సాహసం వల్ల ఆ బంగారం తిరిగి ఆమె వద్దకు చేరింది. మజ్జివలస గ్రామానికి చెందిన ఒక మహిళ బ్యాంకు నుండి తిరిగి స్వగృహానికి వస్తుండగా ముగ్గురు యువకులు ఒక ద్విచక్ర వాహనంపై వచ్చి బంగారం తాడును తెంపుకొని పద్మనాభం వైపు వెళ్ళిపోతుండగా మహిళ గట్టిగా కేకలు వేసింది. అప్పుడు అటువైపు వస్తున్న కురపల్లి గ్రామానికి చెందిన బాడితిబోయిన బంగారప్పుడు దొంగల్ని వెంబడించి పట్టుకున్నారు. ఆ దొంగలను చితకబాది వారిని పోలీసు వారికి అప్పచెప్పారు. బంగారప్పుడును గ్రామస్తులు అందరూ అభినందించారు.

నాణ్యత లేని పశుదాణా అమ్మితే చర్యలు

విశాలాంధ్ర – వి.మాడుగుల: మాడుగులలో ఉన్న మన గ్రోమోర్ పశుదాణా విక్రయ కేంద్రాన్ని మాడుగుల ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ చిట్టినాయుడు ఆకస్మిక తనిఖీ చేసి దాణా బస్తాల నాణ్యతను పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ పశు దాణా చట్టం–2020 ప్రకారం ప్రభుత్వం వారి ఆదేశాలు మేరకు షాపులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న దాణా బస్తాల నుంచి బస్తాలపై ఉన్న మోతాదు ప్రకారం ప్రొటీన్, ఫైబర్, కాల్షియం, ఫాస్ఫరస్, తేమ శాతం ఉన్నది లేనిది తెలుసుకునేందుకు నమూనాలు సేకరించి విశాఖపట్నంలోని లేబరేటరీకి పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ చట్టం ప్రకారం మండలంలో ఎవరైనా విక్రయదారులు నాణ్యత లేని పశు దాణా అమ్మితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కుండపోత వర్షాలతో నీటమునిగిన పంటపొలాలు

విశాలాంధ్ర – ముంచింగి పుట్టు: మండలంలో గత రెండు రోజులుగా కుండపోతగా కురుస్తున్న భారీ వర్షానికి మండల పరిధిలో గల సుజనకోట, మాకవరం పంచాయతీ పరిధిలో పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. కొత్తసుజనకోట గ్రామానికి చెందిన సొలగం గాసిరాందొర అనే రైతుకు చెందిన పంట పొలాల్లో మట్టి దిబ్బలు కొట్టుకొచ్చి అపార నష్టం వాటిల్లింది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద ఉధృతంగా ప్రవహిస్తునడంతో పంట పొలాలు పూర్తిగా దెబ్బతిని రైతులు పూర్తిగా నష్టపోయారు. వరద ఉధృతికి పంట పొలాలు కోతకు కూడా గురి కావడంతో ఏం చేయలేని పరిస్థితిలో గిరిజన రైతులు నిరాశతోనే పంట పొలాల వైపు చూస్తున్న పరిస్థితి నెలకొందని గాసిరందొర ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రెండు రోజుల కురుస్తున్న భారీ వర్షాలకు వరి పంట పొలాలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని పలువురు రైతులు వేడుకొంటున్నారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

విశాలాంధ్ర – ముంచింగిపుట్టు: మండల పరిధిలో మారుమూల గ్రామాల్లో గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఎస్సై రవీంద్రను ఆదేశించారు. మండలంలో మంగళవారం ఆకస్మికంగా పర్యటించిన ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. స్టేషన్ ప్రాంగణం గదులను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, ఫిర్యాదులపై స్థానిక ఎస్ఐ కె.రవీంద్రను ఆయన అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కారానికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మారుమూల ప్రాంతాల్లో గంజాయి సాగు చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపి వారిని గుర్తించి కేసులు పెట్టాలని అన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇప్పటి ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని ఎస్సై రవీంద్రను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు సత్వరమే పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో స్టేషన్ లో ఎటువంటి పెండింగ్ కేసులు ఉండరాదని ఆయన అన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణకు దరఖాస్తులు

విశాలాంధ్ర బ్యూరో – పాడేరు: నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గిరిజన నిరుద్యోగ యువత నుండి వృత్తి నైపుణ్య రంగాలలో తగిన శిక్షణ అందించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేసారు. వృత్తి నైపుణ్య శిక్షణ అందించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నామన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాలకు చెందిన నిరుద్యోగ గిరిజన యువత సంబంధిత మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. టైలరింగ్, నిర్మాణ రంగం, పర్యాటక, ఆతిథ్య రంగం, ప్లంబింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆటోమోటివ్, సెక్యూరిటీ గార్డు, తాపీ పనిలో ఆసక్తి మేరకు శిక్షణ అందిస్తారని చెప్పారు. ముఖ్యంగా జి.కె.వీధి, చింతపల్లి, జి.మాడుగుల, పాడేరు, పెదబయలు, ముంచింగుట్టు, హుకుంపేట, డుంబ్రిగుడ మండలాలకు చెందిన మారుమూల గ్రామాలకు చెందిన గిరిజన యువత దరఖాస్తు చేయాలని స్పష్టం చేశారు. అభ్యర్థి పూర్తి వివరాలు పేరు, తండ్రిపేరు, ఆధార్ నంబరు, మండలం, గ్రామం తెలియజేస్తూ ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేయాలని కోరారు. గిరిజన నిరుద్యోగ యువత ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

మైనర్ బాలికను మోసం చేసిన నిందితుడ్ని శిక్షించాలి

విశాలాంధ్ర – హుకుంపేట: మైనర్ బాలికను మోసం చేసి ఏడేళ్ల గర్భవతిని చేసి చావుకు కారణమైన పాంగి చిట్టిబాబుపై చట్టపరమైన కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని జిల్లా మహిళా సంఘ ప్రధాన కార్యదర్శి హైమావతి డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన సంఘ కార్యాలయం వద్ద పలువురు గిరిజన సంఘ మహిళలతో కలసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈదులుగొంది గ్రామానికి చెందిన మైనర్ బాలికను ప్రేమించానని నమ్మించి ఏడు నెలల గర్భవతిని చేసి నేడు తన చావుకు కారణమైన చిట్టిబాబుపై మహిళ సంబంధిత కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలని కోరారు. ఒక మహిళను ప్రేమించి మరో మహిళను పెళ్లి చేసుకోవటం అన్యాయమని దీనిని తట్టుకోలేకనే మైనర్ బాలిక ఆత్మహత్య చేసుకుందని పేర్కొన్నారు. మైనర్ బాలిక మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించకపోతే మహిళ సంఘం తరుపున భారీ ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

14 నుంచి విజ్ఞాన్‌లో విస్టా-2023

విశాలాంధ్ర – కూర్మన్నపాలెం: సెప్టెంబర్ 15 ఇంజనీర్స్ డే సందర్భంగా దువ్వాడ విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ఈ నెల 14, 15 తేదీల్లో జాతీయ స్థాయిలో టెక్నికల్ ఈవెంట్స్ విస్టా 2023 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కళాశాల రెక్టార్ డాక్టర్ వి. మధుసూదన రావు, ప్రిన్సిపల్ డాక్టర్ జోతుల సుధాకర్ తెలిపారు. 14, 15 తేదీల్లో విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయిలో టెక్నికల్ ఈవెంట్స్‌ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబం ధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పిఎస్ రవీంద్ర, కన్వీనర్ డాక్టర్ బోదే ప్రసాద్, కో-కన్వీనర్ ఎం.పద్మాకర్, ఇతర విభాగాల డీన్స్ పాల్గొన్నారు.

మెయిన్‌రోడ్డు నిర్మాణంలో భవన వ్యర్థాల వాడకం

రోడ్డు పక్కన వేసిన వ్యర్థాలు

పడకొడుతున్న భవనం

చదును చేసిన దృశ్యం

విశాలాంధ్ర – పాయకరావుపేట: పాయకరావుపేట మెయిన్‌రోడ్డు నిర్మాణంలో భవన నిర్మాణ వ్యర్థాలు వాడకంపై పట్టణ ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. చిత్రమందిర్ థియేటర్ ఎదురుగా ఉన్న ఒక శిథిలమైన భవనాన్ని పడగొట్టి, అక్కడ వచ్చిన వ్యర్థ పరికరాలు తీసుకొచ్చి కొత్తగా నిర్మించే రోడ్డుకు ఇరు వైపులా వేస్తున్నారు. వాస్తవానికి ఆ ప్రదేశంలో గ్రావెల్ వేయాల్సి ఉండగా వ్యర్థ పరికరాలు వేయడంపై ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పాయకరావుపేట ప్రజల చిరకాల కోరిక పాయకరావుపేట మెయిన్‌రోడ్డు విస్తరణ. అటువంటి మెయిన్‌రోడ్డు విస్తరణకు ఎన్నో అడ్డంకాలు ఎదురయ్యాయి. అడ్డంకులు అన్ని తప్పించి రోడ్డు నిర్మాణం చేద్దామనుకునే సరికి నిధులు కాస్త వెనక్కు వెళ్ళాయి. రోడ్డు విస్తరణ వివాదం కోర్టులో ఉండడంతో ఎమ్మెల్యే, ఎంపి, జిల్లా కలెక్టర్ కృషితో సుమారు రూ. 1.83 కోట్లు విడుదల చేసి పాత రోడ్డుపై కొత్త రోడ్డు వేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. రోడ్డు పనులు ప్రారంభించి, పనులు జరుగుతుండడంతో అందరూ నిర్మిస్తున్న రోడ్డును చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే మంగళవారం వ్యర్థ పరికరాలు తీసుకొచ్చి నిర్మిస్తున్న రోడ్డుకు ఇరుపక్కల వేస్తుండంతో కొత్త రోడ్డు త్వరగా పాడయ్యే అవకాశాలు ఉన్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈవిషయమై విఎంఆర్‌డిఏ ఏఈ రవిశంకర్‌ను వివరణ కోరగా వ్యర్థ పరికరాలు వేస్తున్న విషయం తెలియదని, వెంటనే నిలుపుదల చేసి వేసిన వ్యర్థాలను తొలగిస్తామని తెలిపారు.

పెందుర్తిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు

విశాలాంధ్ర – పెందుర్తి: పెందుర్తిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కృషి చేయాలని అఖిల భారత విద్యార్థి సమైక్య సంఘం (ఏఐఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి యు.నాగరాజు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ పెందుర్తి నియోజకవర్గ మహాసభ స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ జిల్లాల విభజన కాకముందు ఆంధ్రప్రదేశ్‌లోనే పెందుర్తి అతిపెద్ద నియోజకవర్గంగా ఉన్నప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కూడా మండలానికి ఓ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని, పెందుర్తిలో నేటికి అమలు కాలేదని పేర్కొన్నారు. అధ్యక్షులు ఎన్.శ్రీను మాట్లాడుతూ ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు కుట్రపూరితంగా విద్యను దూరం చేస్తోందని మండిపడ్డారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ పెందుర్తి నియోజకవర్గం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో ప్రధాన కార్యదర్శిగా కొల్లి జయవర్ధన్, అధ్యక్షులుగా జి.మార్తను ఎన్నుకున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మంత్రి అమర్నాథ్

విశాలాంధ్ర – కశింకోట: మండలంలో ప్రభుత్వం మంజూరు చేసిన అనేక సంక్షేమ కార్యక్రమాలు అర్హులందరికీ సమృద్ధిగా అందుతున్నాయని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్నాథ్ అన్నారు. మంగళవారం మంత్రి అమర్నాథ్ కశింకోట మండలం ఉగ్గిన పాలెం గ్రామంలో గడప-గడపకూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్నాథ్ పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ గ్రామంలో 19.65 లక్షల రూపాయల వ్యయంతో కొత్తగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని, 25 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అదేవిధంగా 16 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన అంగన్వాడి భవనాన్ని, ఉగ్గినపాలెం గ్రామ ప్రజలకు తాగునీటిని అందించేందుకు అవసరమైన 19.40 లక్షల రూపాయలతో నిర్మించిన 60 కే.ఎల్ వాటర్ ట్యాంక్‌ను, 6.4 లక్షల రూపాయలతో నిర్మించిన చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని, 15.20 లక్షల రూపాయలతో నిర్మించిన సి.సి.రోడ్లు, డ్రైన్లను, మూడు లక్షల రూపాయలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. గ్రామాల్లోని మండల ప్రాథమిక పాఠశాల భవనాన్ని 18.86 లక్షల రూపాయలతో నాడు నేడు పథకం కింద ఆధునీకరించిన భవనాన్ని మంత్రి ప్రారంభించారు. బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి కింద ఉగ్గినపాలెం గ్రామంలోని 19 స్వయం సహాయక సంఘాల్లోని 26 మంది సభ్యులకు కోటి 90లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు భీశెట్టి సత్యవతి, కశింకోట ఎంపీపీ కలగా లక్ష్మీ గున్నాయ నాయుడు, జడ్పీటీసీ దంతులూరి శ్రీధర్ రాజు, మండల పార్టీ అధ్యక్షుడు మలసాల కిషోర్, జిల్లా అధికార ప్రతినిధి మళ్ళ బుల్లిబాబు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు నమ్మి మీనా, పెంటకోట జ్యోతి పాల్గొన్నారు.

రెండు కేసుల్లో ఐదుగురు నిందితుల అరెస్టు

విశాలాంధ్ర బ్యూరో – అనకాపల్లి: జిల్లాలోని నక్కపల్లి, నాతవరం పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన రెండు నేరాలలో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి నగలు, నగదు స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో కేసుల వివరాలను వెల్లడించారు. నక్కపల్లి మండలం జానకయ్య పేట సచివాలయం పరిధిలో పెన్షన్ నగదు దోపిడీకి సంబంధించి ప్రధాన ముద్దాయి సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎ.నాని బాబు, గాజువాక, మల్కాపురానికి చెందిన అతని చిన్నప్పటినుంచి స్నేహితులు డి.సాయి కుమార్, సి.హెచ్.సాయిగా గుర్తించమని తెలిపారు. వీరు చెడు అలవాట్లకు, జల్సాలకు అలవాటు పడిన కారణంగా ఏదైనా నేరం చేయాలని ముగ్గురు ముద్దాయిలు గాజువాకలో గత నెల 31న తెల్లవారు జామున సమావేశమై, కుట్రపూరితంగా ఒక పథకం పన్నారన్నారు. నాని బాబు ప్రతి నెలా జానకయ్యపేట సచివాలయం నుండి వెల్ఫేర్ అసిస్టెంట్‌తో కలసి వృద్ధుల పెన్షన్ సొమ్ము సుమారు 13.5 లక్షలు ఐ.ఓ.బి బ్యాంక్ నక్కపల్లి నుండి విత్ డ్రా చేసి తీసుకొని వచ్చి, వాలంటీర్ల ద్వారా పెన్షనర్లకు పంచేవారు, ఆ సొమ్మును మార్గమధ్యంలో దోచేయడం ద్వారా వారియొక్క జల్సాలు తీరుతాయని నాని బాబు చెప్పగా డి.సాయి కుమార్, సిహెచ్ సాయిలు కూడా అంగీకరించారు. పథకం ప్రకారంగా ఆగస్టు 31న విత్ డ్రా చేసిన వృద్ధుల పెన్షన్ కాజేశారన్నారు. దీనిపై వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు నక్కపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి ముగ్గురు నిందితులను అదుపులో తీసుకొని వారి వద్ద నుంచి రూ.12,92,000/-, పల్సర్ బైక్, 5 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే నాతవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒంటరి మహిళలే లక్ష్యముగా చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నిందితులు బొత్స వీరబాబు, అల్లు నూకరాజులను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాలు అంగీకరించారని వారి వద్ద నుంచి నాలుగు లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడు బొత్స వీరబాబుపై ఇప్పటికే 40 కేసులు ఉన్నాయని ఎస్పీ వెల్లడించారు. విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: నూతనంగా ఎన్నికైన జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు జీవీఎంసీ కమిషనర్ సియం సాయికాంత్ వర్మని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర అభివృద్ధికి అందరూ కలసి పని చేయాలని కోరారు. కాంట్రాక్ట్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బిల్లులు, ఈఎండీ, ఎఫ్ఎండి, ఏఎస్‌డి

చెల్లింపులు జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ రొంగలి జగన్నాథం, అధ్యక్షులు గొంప చంద్రమౌళి, కార్యదర్శి రంధి సాధురావు, ఉపాధ్యక్షులు పిఎ రాజు, పియస్ ప్రసాద్, బి.రామానాయుడు, ఎం.సంజీవరెడ్డి, సలహాదారు వైఐవి ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శి అల్లు గోవిందరావు, జాయింట్ సెక్రటరీ పిల్లా సూరిబాబు, రాజాన రాంబాబు గణేష్, మెంబర్లు యం.రవికుమార్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారానికే గడప-గడపకు

విశాలాంధ్ర – యస్.రాయవరం: సమస్యల పరిష్కారానికి గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబురావు అన్నారు. మంగళవారం మండలంలోని దార్లపూడి గ్రామ సచివాలయం పరిధిలో రెండవ రోజు గడపగడపకు తిరిగి ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కాకర దేవి, ఎంపీడీవో రామ చంద్రమూర్తి, తహశీల్దార్ విజయకుమార్, వైసీపీ జిల్లా కార్యదర్శి కొణతాల శ్రీనివాస రావు, వైసీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వర్‌రావు, పోలిశెట్టి సతీష్, కసింకోట నీలందరావు, నల్లమారి రమణ, కుసుమంచి శ్రీను, బాబి తదితరులు పాల్గొన్నారు.

బుడగ జంగాల కాలనీకి సీసీ రోడ్డు నిర్మించండి

విశాలాంధ్ర – ఆనందపురం: మండలంలో ఆనందపురం పంచాయతీ పరిధిలో ఉన్న బుడగ జంగాల కాలనీలో సుమారు 100 కుటుంబాలు ఏళ్ల తరబడి జీవనం గడుపుతున్నారని వెంటనే 50 అడుగుల సీసీ రోడ్డును నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు. చిన్నపాటి వర్షం పడినా కూడా రాళ్లు తేలుతూ నడిచేందుకు ఇక్కట్లు పడుతున్నామని అన్నారు. ఈ సమస్యపై ఇటీవల జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌కి వినతి అందించామన్నారు. రోడ్డు సమస్యను దృష్టిలో పెట్టుకొని పరిష్కారం చేయాలని కాలనీ ప్రెసిడెంట్ అప్పలస్వామి, నాగరాజు, గౌరీశ్వరరావు, అప్పారావు, వెంకట్, సంతోష్, బంగారి కోరుతున్నారు.

వైఎస్ఆర్ బీమా చెక్కు అందజేత

విశాలాంధ్ర – సింహాచలం: గ్రేటర్ విశాఖ జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో 91వ వార్డు లక్ష్మీ నగర్‌లో ఇటీవల గుండెపోటుతో చనిపోయిన దండి పుష్ప దహన ఖర్చుల నిమిత్తం వారి కుటుంబ సభ్యులకు వైఎస్ఆర్ బీమా పదివేల రూపాయల చెక్కును 91వ వార్డు అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు.

ఈ కార్యక్రమంలో 92వ వార్డు అధ్యక్షులు జి. అప్పలస్వామి నాయుడు, ఊటపల్లి గోవిందు, ఆర్‌పి కృపామణి, కన్వీనర్లు మీసాల రత్నం, వి.అనురాధ పాల్గొన్నారు.

డెల్లాయిట్‌కు 43 మంది గీతం విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర – మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ద్వారా ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తూ ఆఖరి ఏడాదిలోకి ప్రవేశించిన విద్యార్థులకు ప్రాంగణ నియామకాలు ప్రారంభం అయ్యాయి. గత రెండు రోజులుగా ప్రముఖ కంపెనీ డెల్లాయిట్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో 43 మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు లభించినట్లు గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ వంశీకిరణ్ సోమయాజుల మంగళవారం వెల్లడించారు. డెల్లాయిట్ వంటి అంతర్జాతీయ సంస్థలో ఉద్యోగాలు సాధించడానికి గీతం జిసిజిసి ద్వారా ఇచ్చిన శిక్షణ, వ్యక్తిత్వ వికాస తరగతులు, సాంకేతిక సదస్సులు, నమూనా ఇంటర్వ్యూలు, హ్యాక్‌థాన్ పోటీలు ఉపయోగపడ్డాయని విద్యార్థులు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం అభినందించారు.

పాస్‌పోర్టు పోయినది

శ్రీహరిపురం నుంచి సింధియా వెళ్లే మార్గంలో బస్సులో ప్రయాణిస్తుండగా 5-6-2023వ తేదీన నా బ్యాగ్ పోయింది. చాట్ల రాజు పాస్ట్‌పోర్టు నెం:S3816387తో పాటు మనీ పర్సు పోయింది. దయచేసి దొరికిన వారు ఈ క్రింద అడ్రస్‌కు 59-22-3 యాదవ స్ట్రీట్, మల్కాపురం, విశాఖపట్నం అర్బన్, పిన్ నెం. 530011, ఆంధ్ర ప్రదేశ్‌కు అందజేయగలరు. లేదా ఫోన్ నెంబరు 9912270823కు సమాచారం అందివ్వాలని కోరుతున్నాను.

VISAKHAPATNAM METROPOLITAN REGION DEVELOPMENT AUTHORITY

'e' Procurement Tender Notice

VMRDA, Visakhapatnam invites tenders on "e" Procurement Platform for 2 Nos. of works with a total ECV of Rs. 499.45 Lakhs with last dates varying from 15-09-2023 and 25-09-2023, 3.30 pm.

for further details please logon to www.apeprocurement.gov.in

Sd/-Metropolitan Commissioner, VMRDA

ముందస్తు ప్లాన్ ప్రకారమే చంద్రబాబు అరెస్టు

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సైకో పరిపాలన జరుగుతోందని, విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబును అరెస్టు చేయడం దారుణమని, చంద్రబాబు అరెస్టులో సీఐడీ అధికారులు వ్యవహరించిన తీరు అత్యంత హేయమని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు విమర్శించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విశాఖలో మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబును ఆయన పెళ్లి రోజు అరెస్టు చేశారని, ముందస్తు ప్లాన్ ప్రకారమే అరెస్టు చేశారని ఆరోపించారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ద్వారా అనేక మంది యువతకు ఉపాధి లభించిందని, యువతకు ఉపాధి కల్పించడం చంద్రబాబు చేసిన తప్పా? అని ప్రశ్నించారు. చంద్రబాబు అరెస్టులో సాక్ష్యాలు చూపించలేకపోయారన్నారు. 16 నెలలు జైల్‌లో ఉన్న జగన్ చంద్రబాబును ఒక్క రోజైనా జైల్‌లో పెట్టాలని చూసారని అయ్యన్న పాత్రుడు అన్నారు. తనను కూడా విశాఖ ఎయిర్ పోర్టులో అరెస్టు చేయలేదని, కిడ్నాప్ చేశారని, పోలీసులు తనను ఎక్కడికి తీసుకువెళ్తున్నారో చెప్పలేదన్నారు. ప్రజలు రోడ్లపైకి రావడం చూసి 41 నోటీస్ ఇచ్చి తనను వదిలేశారన్నారు. ప్రాజెక్టులు అమలు చేసేటప్పుడు మంత్రులు నిర్ణయం తీసుకుంటారని అధికారులు అమలు చేస్తారని అన్నారు.

కొనసాగుతున్న నిరసనలు...

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టుపై విశాఖలో నిరసనలు కొనసాగుతున్నాయి. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి శాంతియుతంగా పాదయాత్ర మొదలుపెట్టగానే పోలీసులు అరెస్టు చేసి పోలీస్ బ్యారెక్స్ తరలించి అక్కడ ఎటువంటి సౌకర్యాలు లేని ప్రాంతంలో క్రింద నేలపైన కూర్చోబెట్టారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, శాసనసభ మాజీ సభ్యులు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, శాసనసభ మాజీ సభ్యులు గండి బాబ్జి, జిల్లా ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాసరావు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి, భీమిలి నియోజకవర్గం ఇంచార్జ్ కోరాడ రాజబాబు, మాజీ కార్పొరేటర్ పైలా ముత్యాలనాయుడు, పొడుగు కుమార్, ముల్లేటి కుమార్ స్వామి ఉన్నారు. అరెస్టు అయిన వారిలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మాజీ మంత్రి ఉన్నప్పటికీ కూడా కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా వేయకుండా ఈ నగర పోలీసులు అవమానించారు.

చాకిరేవుగా తయారైన పెద్ద పైపు

తాగునీరు కలుషితమై ప్రబలుతున్న వ్యాధులు

విశాలాంధ్ర - చింతపల్లి: మండల కేంద్రంలోని ప్రజలకు తరతరాలుగా త్రాగునీటిని అందించే పెద్ద పైపు ఒకవైపు పెరిగిన జనాభా, మరోవైపు వాతావరణంలో మార్పుల కారణంగా ఊట జలం కరిగిపోతున్నప్పటికి, నేటికీ పెరిగిన జనాభాకు దాహార్తిని తీరుస్తున్న పెద్ద పైపు ఊట జలం, నేడు ఆ నీళ్లనే పట్టి అక్కడే బట్టలు ఉతకడం మొదలుపెట్టడం వలన ఊట జలం కలుషితమవుతుంది. దీంతో అనేక వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఈ పరిణా మాలతో గ్రామంలోని పురవీధుల ప్రజలు వ్యాధు లతో అల్లాడుతున్నారు. ఆసుపత్రులన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఎంత జరుగుతున్నా, పంచా యతీ పాలకవర్గం గానీ, అధికారులు గానీ పట్టిం చుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. చింతపల్లి కేంద్రంగా ఎన్నో రక్షిత త్రాగునీటి ప్లాంట్‌లు ఉన్నప్పటికీ ఎక్కువమంది ప్రజలు నేటికీ పెద్ద పైపు నీటినే త్రాగునీటి వనరుగా ఉపయోగిస్తున్నారు. అంతటి ప్రాశస్త్యం కలిగిన పెద్ద పైపు వద్ద నేడు కొంతమంది (పలువురు మహిళలు) బట్టలు ఉతుకుతూ త్రాగునీటి వనరును చాకిరేవుగా తయారు చేశారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పెద్ద పైపు వద్ద బట్టలు ఉతికే విధానానికి చరమగీతం పాడాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

సచివాలయం ఉద్యోగుల కీచక పర్వం

విశాలాంధ్ర - పెందుర్తి: విశాఖ నగరంలో వార్డు సచివాలయం ఉద్యోగుల కీచక పర్వం వెలుగులోకి వచ్చింది. ముఖ్యమంత్రి జగన్ ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వార్డు సచివాలయంలో ప్రజలకు సేవలందిచాల్సిన ఉద్యోగులు దళిత మహిళా వాలంటీర్‌ను మానసికంగా, లైంగికంగా వేధిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్న ఘటన పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని 1086486 సచివాల యంలో చోటుచేసుకుంది. ఈ మేరకు బాధితురాలు తన భర్తతో కలిపి పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసారు. అనంతరం వారు మీడియాకు వివరాలు వెల్లడించారు. వేపగుంట ప్రధాన రహదారి ప్రక్కనే ఉన్న జోన్ 8 కార్యాలయంకు కూత వేటు దూరంలో ఉన్న 1086486 నంబరు గల సచివాలయం అడ్మిన్ రాము, ఏమినిటీ సెక్రటరీ కిరణ్‌లు సంవత్సరం నుండి తనను నానారకాలుగా వేధింపులకు గురిచేస్తున్నారని బాధితురాలు కన్నీటిపర్యంతమైంది. నాతో రా, నాతో చాటింగ్ చెయ్యి అంటూ మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అవేదన వ్యక్తం చేసింది. భర్త సహాయంతో పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజ్‌కు ఫిర్యాదు చేసినా వేధింపులు ఆగడం లేదని ఆమె వాపోయింది. సచివాలయం ఉద్యోగుల వేదింపులు తాళలేక తన భార్య ఆత్మహత్యకు ప్రయత్నించిందని బాధితురాలి భర్త చెప్పారు. అలాంటి కీచకులను కఠినంగా శిక్షించాలని అధికారులను కోరారు.

పోలీసులు ఫైన్లు వేస్తున్నా... షరా మామూలే

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ సెల్‌ఫోన్ మానవ జీవితాల గతిని మార్చేస్తుందన్నది నూటికి నూరుపాళ్ళు నిజం. నిజానికి ఫోన్ చాలా అవసరమే. సమాచార చేరవేతలో ఫోన్ వహించే పాత్ర అనిర్వచనీయం. ఉత్తరాల ద్వారా సమా చారాన్ని దూర ప్రాంతాలకు పంపాలను కున్నప్పుడు ఎన్నో వ్యయ ప్రయాసలుండేవి. సమయం కూడా ఎంతో పట్టేది. అలాంటిది సెల్‌ఫోన్ వచ్చిన తర్వాత ఏ సమాచారమైనా క్షణాల్లో అవతలి వ్యక్తికి చేరిపోతుంది. దానికి సమాధానం కూడా అంతే వేగంగా అందుతోంది. కానీ అదే సెల్ ఫోన్ ఇపుడు మనిషి ఆయువును కూడా తీసేస్తోంది. ముఖ్యంగా డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్ఫోన్ వాడకం ప్రమాదాన్ని ఆహ్వానించడమే. టూ వీలర్ నడుపుతున్నప్పుడు... ఫోర్ వీలర్లో వెళుతున్నప్పుడు డ్రైవింగ్ సీట్లో కూర్చున్న వ్యక్తులు కూడా సెల్ఫోన్ మీద దృష్టి పెట్టడం వల్ల ప్రమాదాల బారిన పడి చావుకు దగ్గరవుతున్నారు. కొన్నిసార్లు అర్జంటుగా మాట్లాడ వలసిన అవసరం ఉండొచ్చు. కారు, గాని బైక్ గాని ఓ నిమిషంపాటు పక్కకి ఆపి మాట్లాడితే పని అవుతుంది. ప్రాణమూ మిగులుతుంది. కానీ దీన్ని సీరియస్‌గా ఎవరూ పట్టించుకోక పోవడం వల్లే ఎన్నో అనర్థాలకు ఆసరా అవుతుంది. పోలీసులు ఫైన్లు వేస్తున్నా షరా మామూలే. పిల్లలయితే పెద్దలు చెప్పొచ్చు. కానీ పెద్దలే సెల్ ఫోన్ చెవిలో పెట్టుకుని డ్రైవింగ్ చేస్తుంటే... ఎవరు చెబుతారు...ఎవరికి చెబుతారు.

జాతీయ రహదారి మరమ్మతులు జరిగేనా...?

విశాలాంధ్ర - ఎటపాక: అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం కన్నాయిగూడెం, ఎటపాకలి సచివాలయల పరిధిలోని సుమారు ప్రధాన అంతర్రాష్ట్ర జాతీయ రహదారి కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా గత సంవత్సరం వరదల కారణంగా మరమ్మతులకు గురయ్యాయి. తెలంగాణ ప్రాంతం నుంచి నిత్యం అధికలోడుతో ప్రయాణిస్తున్న ఇసుక లారీల వలన రోడ్డు పూర్తిగా దెబ్బతిని పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీనివలన ఈ ఇసుక లారీలు గుంతల్లో ఇరుక్కు పోతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం చింతలగూడెం సరిహద్దు ప్రాంతంలో ఒక ఇసుక లారీ దిగబడి దానిని తీయడానికి ప్రైవేట్ వ్యక్తుల జె.సి.బిల ద్వార ఇష్టానుసారం రోడ్లు తవ్వేసి గుంతలో దిగబడిన లారీలను వెలికి తీస్తున్నారు. దీంతో మరింత ప్రమాదకరంగా రహదారులు మారుతున్నాయని, నిత్యం ప్రయాణించే వాహనదారులకు రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నది. ఇకనైనా సంబంధిత అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఈ జాతీయ రహదారిని మరమ్మత్తుని చేపట్టి వాహనదారుల ఇక్కట్లు తీర్చవలసిందిగా ప్రజలు కోరుతున్నారు.

ఉషా పరిణయం ప్రభంద కావ్యావిష్కరణ

విశాలాంధ్ర - చోడవరం: భారత సనాతన ఆది కావ్యం మహాభారతం నుండి సేకరించిన ఉషా పరిణయం ప్రభంద కావ్య పుస్తకాన్ని స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో సురభి సంస్థ అధ్యక్షుడు కళ్యాణ రామారావు అధ్యక్షతన, ఆహూతుల మధ్య ఆవిష్కరింపబడింది. విశ్రాంత తెనుగు పండితులు బ్రహ్మశ్రీ ఓరుగంటి వెంకట నరసింహం రచింపగా, చోడవరలోని ప్రముఖ పారిశ్రామిక వేత్తలు ఉప్పల వెంకట సత్యనారాయణ గుప్తా (సతీష్), పసుమర్తి శ్రీనివాసరావు గుప్తా (బ్రూక్ బాండ్) ల ఆర్థిక సహకారం తో కావ్య పుస్తక ముద్రణ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మహా భారతం నుండి రచించిన ఉషా పద్య ఘట్టం నుండి సేకరించబడినట్లు రచయిత తెలియజేశారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు టి.వి.రమణ పద్యాలకు భావ వ్యక్తీకరణ చేశారు. అనంతరం రచయిత, ఆవిష్కర్త, అనువాదీకులను, సాహితీ ప్రియులను వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా పండిత సత్కార్యాలు చేసి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్తలు ఉప్పల సతీష్ గుప్తా, పసుమర్తి శ్రీనివాస రావు గుప్తా, ప్రముఖ సాహితీవేత్త, విశ్రాంత అధ్యాపకుడు ప్రాత రాజశేఖర్, జిల్లా నాటక పరిషత్తు అధ్యక్షులు ఏ.ఆర్.జి.శర్మ, విశ్రాంత ఆర్.జె.డి. తిరుపతిరావు, ఘంటసాల విశ్వనాథం, రేగులగెడ్డ గాయత్రీదేవి, వాసవి క్లబ్ కార్యవర్గం తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బిఐ అలారం మోత మోగిపోతుంది

విశాలాంధ్ర - పాయకరావుపేట: పట్టణంలోని స్టేట్ బ్యాంకు ఇండియా బృందావనం శాఖకు చెందిన అలారం తరుచూ అనవసరంగా మోగుతూ ఉండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవు తున్నారు. సోమవారం రాత్రి నుండి మంగళవారం బ్యాంకు తెరిచే వరకూ అలారం మోగుతూనే ఉంది. బ్యాంకులో ఎటువంటి సంఘటనలు జరిగినపుడు మాత్రమే అలారం మోగాలి. అయితే ఇటీవల కాలంలో తరుచూ బ్యాంకులో ఎటువంటి సంఘటనలు జరగకపోయినా అలారం మోగుతూనే ఉంది. రాత్రి అంతా అలారం మోగడంతో బ్యాంకు ఏమైనా జరిగిందా అని ప్రజలు భయాందోళనలు చెందారు. గతంలో కూడా పలు పర్యాయాలు జరిగినా బ్యాంకు సిబ్బంది పట్టించుకోలేదని పలువురు తెలిపారు. ఈవిషయాన్ని సిఐ అప్పలరాజు దృష్టికి తీసుకెళ్ళగా గతంలో చాలా సార్లు అలారం మోగుతున్న విషయాన్ని స్థానికులు సమాచారం అం దించారని తెలిపారు. బ్యాంకులో ఏమైనా జరిగిందా అని పరిశీలించే వారమని, సిబ్బంది నిర్లక్ష్యంగా కారణంగా తరుచూ అలారం మోగు తుందని తెలిపారు. అనవసరంగా అలారం మోగకుండా చూడాలని బ్యాంకు సిబ్బందికి తెలిపామన్నారు.

నేటి నుండి మండల స్థాయి క్రీడలు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 13 నుండి 15వ తేదీ వరకు మండల స్థాయి ఆట పోటీలు నిర్వహించనున్నట్లు మండల కోఆర్డినేటర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాట్మెంటన్, షటిల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్ పోటీలు అండర్ -14, అండర్ -17 వివిధ విభాగాల్లో జరుగుతాయన్నారు. 3 రోజులు పాటు జరిగే ఈ పోటీలలో 13న బాలురకు, 14న బాలికలకు, 15న బాల బాలికలకు పోటీలు నిర్వహించబడతాయన్నారు.

ఘనంగా పోషకాహార మాసోత్సవాలు

విశాలాంధ్ర - దేవీపట్నం: రంపచోడవరం సమీకృత మాతా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దేవీపట్నం మండలం పెదభీంపల్లి కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం గర్భిణీలు, తల్లులకు అంగన్వాడీలో అందించే పోషకాహారంపై వివిధ పదార్థాలు తయారుచేసి స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు తల్లి పాల వలన బిడ్డకు కలిగే ప్రయోజనాలు తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో దేవీపట్నం స్టేషన్ ఎస్సై నాగార్జున, సిడిపిఓ సంధ్యారాణి, గ్రామ సర్పంచ్ కలుం నర్సమ్మ, మడకం దుర్గారావు, ఎంపిటిసి లక్ష్మీ కుమారీ, ఏఎన్ఎమ్ టి.వరలక్ష్మి, సంధ్య, ఎంఎస్‌కె రాధిక, పి.ప్రకాష్, కుమారి, ఎస్‌హెచ్‌జి సభ్యులు విజయలక్ష్మి పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల జీతాలు వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర-దేవరాపల్లి: దేవరాపల్లి మండల సిపిఐ కార్యదర్శి గరికిన రాజు మండలంలో పలు గ్రామాలు స్వయంగా వెళ్లి గ్రీన్ అంబాసిడర్లను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీలోని చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించడమే కాకుండా పంచాయతీలు, మురికి కాలువలను పరిశుభ్ర పరుస్తున్న గ్రీన్ అంబాసిడర్‌లకు 11 నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఏం తిని బ్రతుకుతారని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా అలాగే ఇదే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వ జీతాలు విడుదల చేసే వరకు పంచాయతీల సర్పంచులు అయినా వీరికి సర్దుబాటు చేయాలనుకుంటే పంచాయితీల్లో కూడా చిల్లిగవ్వ లేని పరిస్థితి నెలకొందని ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన చేపట్టాల్సి ఉంటుందన్నారు. సంబందిత అధికారులు త్వరితగతిన ఈ విషయంపై దృష్టి సారించాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయుడుకు సన్మానం

విశాలాంధ్ర - యస్.రాయవరం: 2023వ సంవత్సరం అనకాపల్లి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికైన గారా రమేష్‌ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దార్లపూడి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యా యులు రమణ శ్రీ మాట్లాడుతూ రమేష్ ఇంకా తన సర్వీసులో ఎన్నో అవార్డులు పొందుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - చింతపల్లి: మండలంలోని కుడుము సారి గెడ్డలో మంగళవారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమయిందని ఆ పంచాయతీ గ్రామ రెవిన్యూ అధికారి (వీఆర్వో) వంతల శ్రీనివాసరావు తమకు ఫిర్యాదు చేశారని అన్నవరం ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. వీఆర్వో శ్రీనివాస రావు ఆయనకు ఫిర్యాదు ద్వారా అందిన వివరాలు ప్రకారం ఎక్కడి నుంచో కొట్టుకు వచ్చిన గుర్తు తెలియని మహిళ మృతదేహం కుడుము సారి గెడ్డలోని తుప్పల్లో చిక్కుకొని ఉందని చుట్టుపక్కల గ్రామస్తులు వీఆర్వో దృష్టికి తీసుకురావడంతో ఆయన మంగళవారం తమకు ఫిర్యాదు చేశాడన్నారు. గుర్తు తెలియని మృతదేహాన్ని గ్రామస్తుల సహాయంతో వెలికి తీసి పంచనామా నిమిత్తం చింతపల్లి తరలించడం జరిగిందని ఎస్సై వెంకటరమణ, వీఆర్వో శ్రీనివాసరావు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట రమణ తెలిపారు.

చంద్రబాబు అరెస్టులో ప్రభుత్వ కుట్ర లేదు

విశాఖ జిల్లా వైసీపీ అధ్యక్షులు కోలా గురువులు

విశాలాంధ్ర - మధురవాడ: చంద్రబాబు నాయుడు అరెస్టులో ప్రభుత్వ కుట్ర ఉందని అనడంలో అర్థం లేదని, 371 కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారనే ఆరోపణల రుజువయ్యాయి కాబట్టే ఆయన జైలు పాలు అయ్యారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు, డిసిసిబి ఛైర్మన్ కోలా గురువులు తెలిపారు. మంగళవారం ఎండాడ వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్టానికి ఎవరూ అతీతులు కాదని చంద్రబాబు విషయంలో తేటతెల్లమైందన్నారు. బాబు చేసిన నేరాలపై సమాధానం చెప్పకుండా ప్రభుత్వాన్ని తప్పు పట్టడం సరైనది కాదన్నారు. ఆర్థిక నేరాలకు, కుంభకోణాలకు పాల్పడిన చంద్రబాబు నాయుడు అరెస్ట్ చేయటం అన్యాయం అంటూ బిజెపి, జనసేన, సిపిఐ, సిపిఎం పార్టీలు ఆందోళనకు దిగడం హాస్యాస్పదమన్నారు.

జీవిత బీమా పాలసీలపై అవగాహన

విశాలాంధ్ర - చోడవరం: జీవిత బీమా సంస్థ(ఎల్.ఐ.సి) పాలసీలపై చోడవరం కార్యాలయం పరిధిలోని ప్రతినిధులు (ఏజంట్లు), వినియోగదారులకు మంగళవారం స్థానిక కళాసీల కళ్యాణ మండపంలో అవగాహన సదస్సు నిర్వహించారు. చోడవరం బీమా సంస్థ ఏజెంట్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చోడవరం సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఐ.శ్రీనివాసరావు, విశాఖపట్నం డివిజన్ ఏజెంట్ యూనియన్ అధ్యక్షులు ఎం.నాగరాజు, బ్రాంచ్ అధికారి ఏ.వో గణపతి, ఎన్.బి.అధికారి లాజర్, టి.ఎస్, పి.ఎస్. శాఖ నుండి రతన్ రాజులు పాల్గొని నూతన ఎల్.ఐ.సి పాలసీలు, పాలసీలు సేకరించే విధానం, క్లైమ్స్ తదితర అంశాలపై ఏజెంట్ మిత్రులకు అవగాహన కల్పించారు. ఏజెంట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఏజెంట్ మిత్రులు క్షేత్ర స్థాయిలో ఎన్నో వ్యయ ప్రయాసలు పడుతున్నారని, ప్రతినిధులకు లబ్ధి కూర్చేందుకు సంస్థ ఏజెంట్ కమీషన్ పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.మోహన్‌రావు, కార్యదర్శి ఎం.శంకర్రావు, కోశాధికారి ఎస్.శ్రీనివాస్‌రావు, సీనియర్ ఏజెంట్లు, మాడుగుల, చీడికాడ, చోడవరం తదితర ప్రాంతాలకు చెందిన ఏజెంట్లు పాల్గొన్నారు.

చదువులో ఆణిముత్యాలు ఆ ఇద్దరు అక్క చెల్లెళ్లు

ఒకే కుటుంబంలో ఇద్దరు ఎంబీబీఎస్ డాక్టర్లు

విశాలాంధ్ర - చింతూరు: చింతూరులోని ఆర్ఎంపీ వైద్యులు బండెల సాగర్, వసంత కుమార్తెలు ఎంబీబీఎస్ డాక్టర్లుగా చదువుతున్నారు. పెద్ద కుమార్తె జ్యోతిర్మయి నాలుగేళ్ల క్రితమే విజయవాడ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫ్రీ సీటు దక్కించుకొని చదువు కొనసాగిస్తున్నది. రెండవ కుమార్తె దివ్య తేజస్విని నీట్ పరీక్షల్లో 720 మార్కులకు గాను 433 మార్కులు సాధించి

తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్‌లో ఫ్రీ మెడికల్ సీటు సాధించి వైద్య విద్య అభ్యసించడానికి ఎంపికైంది. ఒకే కుటుంబంలో ఇద్దరు ఎంబీబీఎస్ సీట్లు సాధించి విద్యను అభ్యసించడం పట్ల చింతూరు గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులైన సాగర్, వసంతలకు శుభాకాంక్షలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేస్తు అభినందిస్తున్నారు. చింతూరులోని ఒకే కుటుంబంలో ఇద్దరు డాక్టర్లు చదవడం చింతూరుకే గర్వకారణం అని గ్రామస్తులు కొనియాడుతున్నారు.

గుంతలు పూడ్చిన పోలీసులు

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి గ్రామం నుండి కాకరపాడు వెళ్లే ఆర్ అండ్ బీ రహదారి దాకరాయి, శరభవరం గ్రామాల వద్ద రోడ్డుపై మోకాలులోతు గోతులు ఏర్పడటంతో వాహనదారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో పలువురు వాహనదారులు ఆ గోతులలో పడి ప్రమాదాలకు గురయ్యారు. ఇదే విషయం ఆ నోట ఈ నోటా రాజవొమ్మంగి పోలీస్‌లకు తెలియడంతో స్పందించిన స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ టిజిఎన్ ప్రసాద్ తన సిబ్బందితో అక్కడకు చేరుకుని లారీతో కంకర తెప్పించి జేసీబీతో రోడ్డు గుంతలు కప్పించారు. విషయం తెలుసుకున్న ఆ ప్రాంత ప్రజలు వాట్సాప్ గ్రూప్ ద్వారా సిఐకి కృతజ్ఞతలు తెలిపారు.

ఈఎన్‌సీని సందర్శించిన గవర్నర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ విశాఖలోని తూర్పు నౌకాదళ కమాండ్‌ని సందర్శించారు. వైస్ అడ్మ్ రాజేష్ పెంధార్కర్ గవర్నర్‌కు స్వాగతంపలికి ఉత్సవ గార్డ్‌ను అందజేశారు. గవర్నర్ ఈస్టర్న్ ఫ్లీట్ యొక్క స్వదేశీంగా నిర్మించబడిన గైడెడ్ మిస్సైల్ స్టెల్త్ ఫ్రిగేట్ శివాలిక్‌ను సందర్శించారు. ఈ సమయంలో ఓడ, తూర్పు నౌకాదళం పాత్ర సామర్థ్యాలపై ఆయనకు వివరించారు. విశాఖపట్నం హార్బర్‌లో కూడా పడవలో పర్యటించి నేవల్ డాక్‌యార్డ్‌లోని సౌకర్యాలను వివరించారు.

ఆర్టీసీ బస్సు బోల్తా: పలువురికి గాయాలు

విశాలాంధ్ర - చింతూరు: అల్లూరి జిల్లా చింతూరు మండలంలోని ఫోర్ బై గ్రామం సమీపంలో విశాఖపట్నం మధురవాడ డిపో నుండి భద్రాచలం వెళ్తున్న లగ్జరీ ఆర్టీసీ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. పదిమంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని డొంకరాయి వైపు వెళు తున్న మరో బస్సులో ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న మోతుగూడెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం తీరును పరిశీలించారు.

గర్భిణీలు పోషకాహారం తీసుకోవాలి

విశాలాంధ్ర - చింతపల్లి: గర్భిణీలు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం వలన వారికి పుట్టే పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తితో పాటు, జ్ఞాపకశక్తి బాగా ఉంటుందని తద్వారా అటువంటి విద్యార్థులు విద్యలో రాణించగలుగుతారని ఏటీడబ్ల్యూఓ బలిరెడ్డి జయనాగలక్ష్మి అన్నారు. పోషకాహార మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని రామాలయం వీధిలోని అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్త రాజేశ్వరి ఆధ్వర్యంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు విజయ కుమారి సత్యవతి, గౌరీల పర్యవేక్షణలో పోషకాహార మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాలు త్రాగడం వలన శిశువులు ఆరోగ్యవంతంగా పెరగడమే గాక వ్యాధి నిరోధక శక్తి,, పిల్లల్లో జ్ఞాపకశక్తి కలిగి ఉండే అవకాశం ఏర్పడుతుందన్నారు. జయ నాగలక్ష్మి, ఐసిడిఎస్ సిడిపిఓ జీవి రమణిలు అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

అణచివేతలో భాగమే చంద్రబాబు అరెస్ట్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: తాము అధికారంలోకి వచ్చాక వైసీపీ ఐదేళ్ల పాలనపై విచారణ చేస్తామని జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు తెలిపారు. మేఘాలయ హోటల్ లో మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రతి పక్ష నేత చంద్రబాబు నాయుడు అరెస్ట్ అణచివేతలో భాగమే అన్నారు. జనసేన నేత, మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ మంత్రుల మాటలు పైశాచిక ఆనందం పొందడానికే అని అర్థం అవుతుంది అన్నారు. తప్పులు చేస్తే అరెస్ట్ చేయొచ్చు, కానీ అర్థ రాత్రి పూట ఒక మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయడం అన్యాయం అన్నారు. చంద్ర బాబు నాయుడుకి జనసేన మద్దతు ఇవ్వడం తప్పు అన్నట్టు వైసీపీ మంత్రులు ప్రకటనలు గుప్పిస్తున్నారన్నారని, రాష్ట్ర మంత్రి అమర్నాథ్ నడ మంత్రపు సిరి చందంగా మిడిసి పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఉత్తర నియోజక వర్గం సమన్వయ కర్త పసుపులేటి ఉషా కిరణ్, జనసేన వీర మహిళ ప్రశాంతి కూడా పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ బురదమయం

విశాలాంధ్ర - మాకవరపాలెం: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మాకవరపాలెం బస్టాండ్ ఆవరణ అధ్వాన్నంగా మారింది. బస్టాండ్ వద్ద బురదమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ ఆవరణలో ఉన్న గోతుల్లో భారీగా నీరు చేరడంట బస్సులో రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కార్మిక నేత పులి అప్పలరెడ్డి వర్ధంతి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: ప్రముఖ కార్మిక నాయకులు, నెల్లి ముక్కు గ్రామ పెద్ద కీర్తిశేషులు పులి అప్పల రెడ్డి మొదటి వర్ధంతిని నెల్లి ముక్కు గ్రామంలోని ఆయన నివాసం వద్ద వారి కుటుంబ సభ్యులు నిర్వహించారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పులి అప్పలరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అప్పల రెడ్డి నెల్లి ముక్కు గ్రామ అభివృద్ధికి, విశాఖ ఉక్కు కర్మాగారంలో, నిర్వాసితుల కోసం, కార్మిక సంక్షేమం కోసం చేసిన కృషి మరువలేనిది అని అన్నారు. ఈ కార్యక్రమంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి, గాజువాక వైఎస్ఆర్సీపీ సమన్వయ కర్త తిప్పల దేవన్ రెడ్డి, వివిధ పార్టీల, కార్మిక సంఘాలకు చెందిన నాయకులు మద్ది శంకర్ రెడ్డి, గొందేసీ మహేశ్వర రెడ్డి, దోమ్మేటి అప్పారావు, గొందేశీ అప్పల రెడ్డి, ములకలపల్లి పెంటయ్య, మంత్రి గోపి, పెద్దాడ సోము నాయుడు, పులి శ్రీరామ రెడ్డి, మద్ది ఈశ్వర రావు, టేకేటి పెంటయ్య, టేకేటి అప్పారావు, కుటుంబ సభ్యులు తిప్పల నితీష్ రెడ్డి, పిట్ట కుంచారావు, పిట్ట గురునాథ్, స్థానిక పెద్దలు సోమ రెడ్డి, నీలాపు తిరుమల రెడ్డి, అప్పల రెడ్డి, కోరిబిల్లి గోవిందరావు, స్వామి, అప్పల రెడ్డి, రెడ్డి, శ్యామ్ ఇతర గ్రామస్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
➡ విశాఖపట్నం
➡ అనకాపల్లి
➡ అల్లూరి సీతారామరాజు

ఏయూలో యానిమల్ హౌస్ ఏర్పాటు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో శాస్త్రీయ పరిశోధనలకు ఉపయుక్తంగా యానిమల్ హౌస్ ఏర్పాటు కానుంది. దీనికి సంబంధించి ఏయూతో హైదరాబాద్‌కి చెందిన రొడెంటా బయోసర్వి సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. మంగళవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో అవగాహన ఒప్పందంపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, రొడెంట బయోసర్వి సంస్థ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ కె.ఆనంద్ కుమార్‌లు సంతకాలు చేసారు. విశ్వవిద్యాలయంలో ఫార్మశీ, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, జువాలజీతో పాటు జీవశాస్త్ర కోర్సులను అభ్యసించే పీజీ, పిహెచ్‌డి విద్యార్థులకు ఉపయుక్తంగా దీనిని ఏర్పాటుచేస్తున్నారు. ఏయూలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలిమెంట్ భవనానికి అనుసంధానంగా దీనిని ఏర్పాటు చేయనున్నారు. నెల రోజుల్లో ఈ కేంద్రం పూర్తిస్థాయిలో సేవలు ప్రారంభించనుంది. కార్యక్రమంలో ఏయూ ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, డీన్ ఆచార్య కె.బసవయ్య, ఆచార్య ఈశ్వర కుమార్, గిరిజా శంకర్, శైలజ, మురళీకృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలలో ఇటువంటి కేంద్రం ఉండటం చాలా అరుదైన విషయమని, రెండు దశల్లో దీనిని విస్తరిస్తామని అన్నారు. ఏయూ విద్యార్థులకు, పరిశోధకులకు ఉపయుక్తంగా నిలపడంతో పాటు అనుబంధ కళాశాలల విద్యార్థులకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించడానికి ఉపయుక్తంగా దీనిని తీర్చిదిద్దాలని సూచించారు. దీనికి ఏయూ సంపూర్ణ సహకారం, భాగస్వామ్యం అందిస్తుందన్నారు. రొడెంటా సిఎస్ఓ డాక్టర్ కె.ఆనంద్ కుమార్ మాట్లాడుతూ నగరంలోని వివిధ పరిశ్రమల అవసరాలు తీర్చుతూ ఆదాయ వనరుగా సైతం ఈ కేంద్రం నిలుస్తుందని అన్నారు.

ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ స్థలం స్వాధీనం

విశాలాంధ్ర - పాయకరావుపేట: పట్టణంలోని దుర్గానగర్‌లోని సర్వే నెంబరు 28లోని ప్రభుత్వ స్థలాన్ని ఎట్టకేలకు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందంటూ తెలుగుదేశం పార్టీకి ఎంపిటిసి మల్లపురెడ్డి రమాకుమారి జిల్లా కలెక్టర్, తహశీల్దార్, పంచాయతీ అధికారులకు గతంలో ఫిర్యాదు చేశారు. పలు పర్యాయాలు రెవెన్యూ అధికారులు సర్వేలు నిర్వహించినా, పంచాయతీ అధికారులు ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోలేకపోయారు. మంగళవారం రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించారు. సర్వే చేసి ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. ఆక్రమణదారులకు చెందిన రిజిస్టర్ పత్రాలను పరిశీలించారు. రిజిస్టర్ పత్రాలు, రెవెన్యూ అధికారుల రికార్డుల ఆధారంగా పరిశీలించి ఒకవైపు 12అడుగులు, మరోవైపు 5అడుగులు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. ప్రభుత్వ స్థలంకు హద్దులు నిర్వహించి, రెవెన్యూ అధికారులు స్థలాన్ని పంచాయతీ అధికారులకు అప్పగించారు. ప్రభుత్వ స్థలంలో ఆక్రమణదారులు వేసిన కంచెను తొలగించాలని, వారి స్థలం వరకు కంచె వేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఈఓపీఆర్‌డి వై.సత్యనారాయణ, డిటి రాజేంద్రప్రసాద్, ఆర్‌ఐ టి.త్రినాద్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, సర్వేయర్ పి.సత్తిబాబు, విఆర్వో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పలు రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - మారేడుమిల్లి: మండలంలో పలుచోట్ల రోడ్లను అభివృద్ధి చేయడానికి శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. గురమామిడి నుండి తాడేపల్లి మూడు కిలోమీటర్ల రోడ్డును ఒక కోటి 15 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు, సున్నంపాడు నుండి నూరిపూడి వెళ్లే ఐదు కిలోమీటర్ల రోడ్డు మూడు కోట్ల 50 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు, కె.వి.లంక నుండి టేకుల వీధికి వెళ్లే మూడు కిలోమీటర్ల రోడ్డుకు ఒక కోటి 50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, తాడేపల్లి గ్రామం మద్దివిడి నుండి వేటుకూరు వెళ్లడానికి నాలుగు కిలోమీటర్లు దూరానికి సుమారు ఒక కోటి 20 లక్షల వ్యయంతో డబ్ల్యూబిఎం రోడ్డు నిర్మాణం, జీఎం వలస నుండి కుండాడ వెళ్లి మూడు కిలో మీటర్లకు ఒక కోటి 35 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి, వేటుకూరు నుండి దేవులంక ఎన్నికల దూరానికి 65 లక్షల డబ్ల్యూబిఎం రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ

కార్యక్రమంలో మారేడుమిల్లి మండల కన్వీనర్, ఎంపీపీ, జడ్పిటిసి, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, సొసైటీ ప్రెసిడెంట్, కార్పొరేషన్ చైర్మన్, వార్డు మెంబర్లు శశివాయ కన్వీనర్లు గృహ సారధులు ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి చేతుల మీదుగా మారేడుమిల్లి సచివాలయంలో 83 మంది లబ్దిదారులకు నూతనంగా 2,750 చొప్పున పెన్షన్లు అందజేయడం జరిగింది.

చంద్రబాబు అరాచకాలకు తగిన శాస్తి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: అవినీతి కేసులో అరెస్ట్ అయ్యి చంద్ర బాబు రాష్ట్ర పరువు తీశారని ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్ వెస్లీ అన్నారు. మంగళ వారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగువాడి ఆత్మగౌరవం అనే నినాదంతో ఏర్పడిన తెలుగుదేశం పార్టీ అదే ఆత్మగౌరవాన్ని భారత దేశంలో మిగతా రాష్ట్రాలు వద్ద తెలుగు ప్రజలు తలదించుకునే విధంగా 371 కోట్ల రూపాయల అక్రమ సంపాదన కేసులో చంద్రబాబునాయుడు జైలుకు వెళ్లి ఈ రాష్ట్ర ప్రజలందరి పరువు తీయడం సిగ్గుచేటు అన్నారు. ఆంధ్రప్రదేశ్లో ఇంతవరకు ఏ మాజీ ముఖ్యమంత్రి కూడా జైలుకు వెళ్లిన సందర్భం లేదని అలాంటిది 14 సంవత్సరముల ఈ మాజీ ముఖ్యమంత్రి కి ఈ 14 రోజుల రిమాండ్ ఏసీబీ కోర్టు విధించడం అంటే చంద్రబాబు రాజకీయంగా సమాధి అయినట్లే అన్నారు. నందమూరి తారక రామారావు దగ్గర వెన్నుపోటుతో పార్టీ బలవంతంగా లాక్కొని ఎల్లో మీడియా ముసుగులో ఈ రాష్ట్ర ప్రజలందరినీ తన దగ్గర ఉన్న దుష్ట చతుష్టయం సహకారంతో ప్రజలందరినీ తనలాంటి నీతిమంతుడు లేడని ఇంతవరకు మభ్యపెట్టడం జరిగిందని, కానీ ఈరోజు చంద్రబాబు నాయుడు చేసిన అవినీతి అక్రమాలు కేంద్ర సంస్థలు జీఎస్టీ కార్యాలయం బయట పెట్టడంతో చంద్రబాబు అవినీతి ఈ రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందన్నారు. 18 నెలలుగా జరుగుతున్న ఈ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కు సంబంధించిన కేసులో ఇప్పటివరకు చంద్రబాబు నాయుడుతో సహా ఎనిమిది మందిని అరెస్టు చేయడం జరిగిందని,ఇదంతా రాజ్యాంగబద్ధంగా న్యాయబద్ధంగా జరిగిన వ్యవహారమని తెలియజేశారు. ఇలాంటి అవినీతి ముఖ్యమంత్రికి చంద్రబాబు నాయుడు దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్, ఉత్త కుమారుడు ఉత్తర ప్రగల్భాలు పలుకుతూ ప్రజాక్షేత్రంలో మేం తేల్చుకుంటామని చెప్పడం చూస్తుంటే ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం, కోర్టులే, ప్రజల ఆశయాలకు ప్రతిబింబాలని తెలియని మూర?త్వంలో లోకేష్ ఉండడం విచారకరం. రాజ్యాంగబద్ధంగా కోర్టులు విధించిన రిమాండ్ ను వ్యతిరేకిస్తూ బందుకు పిలుపు ఇవ్వడం అంటే ప్రజాస్వామ్యం మీద రాజ్యాంగం మీద లోకేష్ కు నమ్మకం లేదని అర్థమవుతుందన్నారు.

ఘనంగా మదర్ థెరిసా జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: ఉక్కునగరం విశాఖ విమల విద్యాలయంలో స్నేహ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో మదర్ థెరిసా జయంతిని ఘనంగా మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటో తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులకు వివిధ అంశాల లో సంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. ముఖ్య అతిథిగా స్టీల్ ప్లాంట్ జీఎం (మైన్స్) బి రంగనాథ్ జ్యోతి ప్రజ్వలన , డిజీఎం, అగనంపూడి సి డబ్ల్యూ సి అధ్యక్షులు సిరికి ఉమామహేశ్వరరావు మదర్ తెరిసా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులను అర్పించారు. విద్యార్థులు ఏకపాత్రానయం జాతీయ గీతాలు జనరల్ నాలెడ్జి వ్యాసరచన పోటీలు విజేతలకు బహుమతి ప్రధానం అతిధులు విద్యార్థులకు చేసితిరి స్నేహ చారిటబుల్ ట్రస్ట్ ఎస్ సత్యనారాయణ 25 సంవత్సరాల నుండి మదర్ తెరిసా జయంతి ఉత్సవాలు ఆయన సొంత ఖర్చుతో విశాఖ విమల విద్యాలయంలో చేయడం పట్ల స్కూలు ప్రిన్సిపాల్ సిబ్బంది కలిపి ఘనంగా సత్కరించారు. బి.రంగనాథ్ మాట్లాడుతూ పిల్లలు విద్యార్థి దశ నుండే దేశానికి మంచి పనులు చేస్తున్న పెద్దవారు గురించి తెలుసుకొని వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకునే విధంగా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని పద్మశ్రీ భారతరత్న నోబెల్ బహుమతి గ్రహీత మదర్ థెరిసా దేశంలో కుష్టువారికి అభాగ్యులైన పేదవారు రక రకాల వ్యాధులతో బాధపడుతున్న వారికి స్వచ్ఛందంగా ఎంతో సేవ చేశారని తెలిపారు. సిరికి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నేటి కలియుగంకు అనుగుణంగా విద్యార్థులు విజ్ఞానాన్ని ప్రతిబిని పెంపొందించుకోవాలని తల్లిదండ్రులు విద్యార్థులకు చదువు లేకుండా వారి అభిరుచికి తగ్గట్టు క్రీడల్లోని సాంస్కృతిక కార్యక్రమాలకు ఉత్తమ విద్యా బోధనకు ప్రోత్సహించాలని తెలిపారు. నేటి వైద్యులు కార్పొరేటర్ హాస్పిటల్ కి పరిమితం కాకుండా పేదవారికి వైద్య సేవలు చేయడానికి మదర్ తెరిసా ని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. విశాఖ విమల విద్యాలయ ప్రిన్సిపాల్ సిస్టర్ లాన్సీ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ గుర్తింపు నాయకులు బి. సత్యనారాయణ వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ అరుణ స్కూల్ స్టాఫ్ కార్యదర్శి డి మధుసూదన్ రావు ఉపాధ్యాయులు రవి దేవదాసు మురళి మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజిద్దాం- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

విశాలాంధ్ర - కొయ్యూరు : కాలుష్య రహిత మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ఈనాడు పాడుతా తీయగా విన్నర్, మా టీవీ సూపర్ సింగర్ దొంతంశెట్టి ధీరజ్ (14) పిలుపునిచ్చారు. మండలంలోని డౌనూరు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ధీరజ్ అక్కడి విద్యార్థులతో మమేకమై సందడి చేశారు. వందేమాతరం జనగణమన గీతాలు రాగయుక్తంగా ఆలపించడంతో పాటు ఆశ్రమ విద్యార్థులతో పాడించారు. గీతాలాపన లలో విద్యార్థులు చేసే చిన్న చిన్న అక్షర దోషాలను చక్కగా వివరించి రాగయుక్తంగా పాడటం నేర్పించాడు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కను నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని సూచించాడు. ఆది పూజ్యుడైన గణపతి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో పర్యావరణ హితమైన మట్టి గణనాథుని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చాడు. పాఠశాల విద్యార్థులతో చిరంజీవి ధీరజ్ మమేకమవడం సంతోషదాయకమని రానున్న రోజుల్లో మరింత ఉన్నత శిఖరాలను ధీరజ్ అధిరోహించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభుదాస్ ఉపాధ్యాయులు సిబ్బంది ఆకాంక్షించారు.

ఓటరు జాబితాలో పొరపాట్లు లేకుండా చూడండి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఓటరు జాబితా సవరణ-2024 కార్యక్రమం జిల్లాలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. మంగళవారం ఉదయం విజయవాడ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు , జాయింట్ కలెక్టర్లతో ఓటరు జాబితా సవరణ -2024 కార్యక్రమం పై సమీక్ష నిర్వహించారు. 06.01.2022 నుండి తొలగింపుల రీ-వెరిఫికేషన్, అనర్హుల ఓటర్లపై రాజకీయ పార్టీల ఫిర్యాదులు, స్థితి, ఫారం 6, 7, 8 పెండెన్సీ, ఇంటింటికి ఓటరు సర్వే లో తీసుకున్న చర్యలు , క్రమరాహిత్యాల పరిశీలన, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఎపిక్ కార్డుల ముద్రణ , పంపిణీ మొదలగు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని అన్నారు . ఓటరు జాబితాలో పేర్లు తొలగింపు ప్రక్రియ వివాద రహితంగా నిర్వహించాలని , నిబంధనలను పకడ్బందీగా పాటిస్తూ క్షేత్రస్థాయి విచారణ తర్వాత మరణించిన వారిని, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లు, రెండు సార్లు నమోదు కాబడిన వాటిని గుర్తించి ఒక పేరును జాబితా నుంచి తొలగించాలని ఆయన సూచించారు. విశాఖ జిల్లా ఓటర్ల జాబితా సవరణ-2024 కు సంబంధించిన ప్రగతి వివరాలను జిల్లా కలెక్టర్ డా ఏ మల్లికార్జున రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తొలగింపుల రీ-వెరిఫికేషన్, అనర్హుల ఓటర్లపై రాజకీయ పార్టీల ఫిర్యాదులు, ఫారం 6, 7, 8 పెండెన్సీ, ఇంటింటికి ఓటరు సర్వే లో తీసుకున్న చర్యలపై సీఈవోకు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుండి కలెక్టర్ డా ఏ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జిల్లా రెవిన్యూ అధికారి కె.మోహన్ కుమార్, విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, భీమిలి ఆర్డివో భాస్కర్ రెడ్డి, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్మెంట్ స్కాం అభూత కల్పన

టీడీపీ జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీష్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: 2014లో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత రాష్ట్ర విభజన అవడంవల్ల నిరుద్యోగ సమస్య నిర్మూలనకు యువతకి అవకాశాలు కల్పించాలని ఉద్దేశంతో స్కిల్ డెవలప్మెంట్ యువతకి కల్పించడానికి 42 నైపుణ్యం శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి 2లక్షల 13వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే ఇందులో కుంభకోణం ఉందని చంద్రబాబు నాయుడు 279 కోట్లు అవినీతికి పాల్పడ్డారని అక్రమ కేసులు బనాయించి చంద్రబాబు నాయుడును ఒక్కరోజు అయినా జైల్లో పెట్టాలని కక్ష తోనే రెడ్డి బ్యూరోక్రాట్స్‌ను వాడుకని అరెస్టుకు సిద్ధపడ్డారని ఇది ముమ్మాటికీ దుర్మార్గమైన చర్య అని అప్రజాస్వామ్య విధానమని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మాజీ శాసన మండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు జగన్ రెడ్డి దుర్నీతిని ఎండగట్టారు. మంగళవారం పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువతకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు 3300 కోట్లకు సీమెన్స్ సంస్థ డిజైనిటిక్ సంస్థలు ఒప్పందం చేసుకున్నాయని ఇందులో ప్రభుత్వం వాటా పది శాతం కాగా 90% ఆ సంస్థ చెల్లించేలా ఒప్పందం చేసుకున్నాయని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం 370 కోట్లు జీఎస్టీతో కలిపి చెల్లించిందని దీనిలో 240 కోట్లు సిమెన్స్ కంపెనీ పేరుతో డిజైనిక్ సంస్థకు బదలాయించారంటూ ఏపీ సిఐడి కేసు నమోదు చేసిందని, రిమాండ్ రిపోర్టులో పేజీ నెంబర్ 16 ఒక పేరాలో 145.37 కోట్లని మరో పేరాలో 279 కోట్లని పేజీ నెంబర్ వన్‌లో ఈ సొమ్మంతా ఎటుపోయిందో, ఎవరు ఖాతాల్లోకి వెళ్లిందో తెలీదని సిఐడి చెప్పిందని, తరువాత ఆడిటర్ రిపోర్ట్‌ని ఆధారంగా తీసుకొని కేసు పెట్టామని, నైపుణ్య కేంద్రాలను సందర్శించ లేదని అక్కడ సాఫ్ట్ వేరు హార్డ్ వేరు విలువలను లెక్కించకుండా తమక అనుమతి ఇవ్వలేదని ఆ సంస్థ పేర్కొందని, బ్యాంక్ గ్యారంటీలు తీసుకోకపోవడం ఆర్థిక శాఖ కార్యదర్శి సునీత చెప్పిన సలహాలు పాటించకపోవడం ఇవి అన్ని చేయవలసిన బాధ్యత అప్పటి నైపుణ్య శాఖ కార్యదర్శి రామచంద్రారెడ్డిదని ఆయన పేరుతో ఒప్పందాన్ని ఆమోదించింది అజయ్ కల్లాం రెడ్డిని వీరు పేర్లు ఎఫ్ఐఆర్‌లో ఎందుకు లేవని సిఐడి అధికారులను నాగ జగదీష్ ప్రశ్నించారు. నైపుణ్య కేంద్రాల పర్యవేక్షణకమిటీలను నియమిస్తూ అప్పటి సీఎస్ ఐవిఆర్ కృష్ణారావు జీవో 8 జారీ చేశారని,ఈ విషయం సిఐడి అధికారులకు తెలియకపోవడం ఆశ్చర్యంగా ఉందని నాగ జగదీష్ అన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టుపై కోడిగుడ్డు మంత్రి గుడివాడ అమర్నాథ్ కు అవహేళంగా మాట్లాడుతున్న జబర్దస్త్ రోజాకు పేరు ఊరు లేని పేర్ని నాని కు విద్యశాఖ పై అవగాహన లేని బొత్స సత్యనారాయణ తో పాటు వైసిపి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని చంద్రబాబు నాయుడు ను టచ్ చేయడం వల్ల వైసిపి అడ్రస్ గల్లంతయ్యే పరిస్థితి ఏర్పడిందని నాగ జగదీష్ జోష్యం చెప్పారు. ఈ సమావేశంలో టి ఎన్ టి యు సి రాష్ట్ర ఉపాధ్యక్షులు ధనాల విష్ణు చౌదరి, సీనియర్ నాయకులు ఆళ్ళ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మన్య ప్రాంతానికే వన్నెతెచ్చిన మట్టిలో మాణిక్యం రవణి

విశాలాంధ్ర - కొయ్యూరు : ఆత్మస్థైర్యం ఉంటే వైకల్యం పేదరికం ప్రతిభకు విజయానికి అడ్డంకి కాదు అనే విషయాన్ని గిరిజన యువతి రవణి నిరూపించిందని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు కొనియాడారు. అంధ బాలికల అంతర్జాతీయ క్రికెట్ లో సత్తాచాటిన అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం మారుమూల రంగసింగిపాడు గ్రామానికి చెందిన అందత్వ విద్యార్థిని రవణి ని మాజీ మంత్రి బాలరాజు తన అనుచర గణాలైనా పలువురు ప్రజా ప్రతినిధులు వైసీపీ నేతలతో వెళ్లి అభినందించారు. రంగసింగిపాడు గ్రామానికి చెందిన పేద గిరిజన కుటుంబంలో పుట్టిన రవణి చిన్నతనం నుండి అందత్వంతో బాధపడుతోంది. ప్రస్తుతం హైదరాబాదులో ఇంటర్ చదువుతున్న రవణి ఇటీవల ఇంగ్లాండ్ లో జరిగిన అంతర్జాతీయ అంధ బాలికల క్రికెట్ మ్యాచ్ లో తన సత్తా చాటి విన్నర్ గా నిలిచింది. అత్యంత మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన రవణి తనకున్న వైకల్యాన్ని సైతం అధిగమించి అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి దేశ ప్రతిష్టను పెంపొందించడం గర్వంగా ఉందని మాజీ మంత్రి బాలరాజు ప్రశంసించారు. రవణి ని అన్ని విధాల ఆదుకునే విధంగా తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని భరోసా కల్పించారు. ఆమె కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ధైర్యాన్నిచ్చారు. మన్య ప్రాంతానికే వన్నెతెచ్చిన మట్టిలోని మాణిక్యం రవణి అని ఆమెను స్ఫూర్తిగా తీసుకుని యువత అన్ని రంగాల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. చదువుతోపాటు క్రీడల్లో మరింత ఉత్తమ ప్రతిభ కనబరిచి రాణించాలని మాజీ మంత్రి అభిలషించారు. ఇటువంటి విశేష నైపుణ్యం కలిగిన విద్యార్థులు క్రీడాకారులకు ప్రతి ఒక్కరు సహకరించి ప్రోత్సహించాలని కోరారు. కాగా రవణి తల్లిదండ్రులకు ఐదుగురు సంతానం కాగా రవణి తో పాటు మరో ఇద్దరు అంధత్వంతో బాధపడుతున్నారు. ఇటువంటి వారిని ప్రోత్సహిస్తూ అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని బాలరాజు పేర్కొన్నారు. యువ క్రికెటర్ రవణి కుటుంబానికి ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దాతలు ముందుకు వచ్చి కుటుంబానికి చేయూత నివ్వాలని కోరారు. అంధత్వాన్ని జయించి అంతర్జాతీయ స్థాయిలో విజేతగా నిలిచిన మన్యం ముద్దుబిడ్డ రవణి నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమని ఇటువంటి వారిని ఆదర్శంగా తీసుకుని యువత విద్యతోపాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని మాజీమంత్రి బాలరాజు పిలుపునిచ్చారు. ఐదుగురు సంతానంలో ముగ్గురు అందత్వంతో బాధపడుతున్న ఆ నిరుపేద గిరి కుటుంబానికి మంచి మనసుతో సహాయ సహకారాలు అందించి అండగా నిలవాలని బాలరాజు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు ఎంపీటీసీలు వైసీపీ నేతలు పాల్గొని విద్యార్థినిని సాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

బిగ్ బాస్ స్పాన్సర్‌గా హైయర్ ఇండియా

విశాలాంధ్ర - విశాఖ సిటీ: గృహోపకరణాలలో గ్లోబల్ లీడర్, 14 సంవత్సరాలుగా మేజర్ అప్లయెన్సెస్‌లో ప్రపంచంలోనే నంబర్ 1 బ్రాండ్ అయిన హైయర్ అప్లయెన్సెస్ ఇండియా (హైయర్ ఇండియా) , ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రియాలిటీ షో బిగ్ బాస్ తెలుగు సీజన్ 7 కోసం అసోసియేట్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నట్లు ఈరోజు వెల్లడించింది. విభిన్నమైన ఆసక్తికరమైన పోటీదారుల కలయికతో, భావోద్వేగాలు మరియు వినోదంతో నిండిన రోలర్‌కోస్టర్ రైడ్‌గా నిలిచే బిగ్ బాస్ తెలుగు ఇప్పుడు ఓటీటీ ప్లాట్‌ఫారమ్ డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ మరియు స్టార్ మాలో ప్రసారం చేయబడుతుంది. ఈ భాగస్వామ్యం గురించి హైయర్ అప్లయన్సెస్ ఇండియా ప్రెసిడెంట్ సతీష్ ఎన్ ఎస్ వ్యాఖ్యానిస్తూ ఈ ప్రాంతంలో అత్యధికంగా వీక్షించబడే టెలివిజన్ షోలలో ఒకటైన ‘బిగ్ బాస్ 7’ తెలుగుతో మళ్లీ అనుబంధం కలిగి ఉన్నందుకు మేము సంతోషి స్తున్నామన్నారు. వినూత్నమైన, విశ్వసనీయమైన మరియు సాంకేతికతతో నడిచే గృహోపకరణాలను అందించడం ద్వారా భారతీయ వినియోగదారుల రోజువారీ జీవితంలో భాగం కావడానికి హైయర్ ఎల్లప్పుడూ కృషి చేస్తోందన్నారు. వినియోగదారులతో కనెక్ట్ అవ్వడానికి మాకు గొప్ప అవకాశాన్ని బిగ్ బాస్ తెలుగు సీజన్ 7 అందిస్తుందన్నారు.

అధ్యాపకులకు సహనమే అతిపెద్ద ఆయుధం

ఏయూలో ప్రారంభమైన ఐడిఆర్‌సి తరగతులు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: యువతను తీర్చిదిద్దడంలో అధ్యాపకునిని సహనమే అతిపెద్ద ఆయుధంగా నిలుస్తుందని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. మంగళవారం ఏయూ హెచ్‌ఆర్‌డిసి కేంద్రంలో నిర్వహిస్తున్న పర్యావరణ శాస్త్రంపై పునశ్చరణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య సమత మాట్లాడుతూ ఇక్కడ నేర్చుకున్న నూతన జ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. సృజనాత్మకత, సహనం, కమ్యూనికేషన్ స్కిల్స్, కాల నిర్వహణ, కాలానుగుణంగా మార్పులను ఆకలింపు చేసుకోవడం వంటివి అలవాటు చేసుకోవాలన్నారు. పర్యావరణ మార్పులు పెను సవాళ్లను విసురుతున్నాయన్నారు. ఊహించని విధంగా వరదలు రావడం,ప్రత్యామ్నాయ ఇంధనాలను అన్వేషించడం ఎంతో అవసరమన్నారు. వాయు కాలుష్యం కారణంగా లక్షలాదిమంది ప్రతీ సంవత్సరం మృత్యువాత పడటం జరుగుతోందన్నారు. అనేక పర్యావరణ సంబంధ సమస్యలకు పరిష్కారాలను చూపే దిశగా ఆచార్యులు కృషి చేయాలన్నారు. ఏయూ హెచ్‌ఆర్‌డిసి కేంద్రం సంచాలకులు ఆచార్య టి.వెంకట కృష్ణ మాట్లాడుతూ విభిన్న జీవులతో సమన్వయం చేసుకుంటూ సాగడం మానవ జీవన విధానమన్నారు. వైవిధ్య అంశాలు, శాస్త్రాల సమ్మేళనంగా పర్యావరణ శాస్త్రం నిలుస్తుందన్నారు. సహజ వనరుల సంరక్షణ, జీవ వైవిధ్య పరిరరక్షణ, పర్యావరణ మార్పులపై అవగాహన, విపత్తులు, వ్యర్థాల నిర్వహణపై అవగాహన పెంచుకోవాలన్నారు. సదస్సు కన్వీనర్ ఆచార్య ఇ.ఉదయ భాస్కర రెడ్డి, ఆచార్య ఎన్.ఏ.డి పాల్ తదితరులు పాల్గొన్నారు.

14 నుండి మండల స్థాయి ఆటల పోటీలు

విశాలాంధ్ర - చోడవరం: అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారిణి ఆదేశాలను అనుసరించి ఈ నెల 14 నుండి చోడవరంలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారిణి జయలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జెడ్.పి.హై స్కూల్ లక్ష్మీపురం నందు ఈ నెల 14న ఖో-ఖో, వాలీబాల్, యోగా పోటీలు నిర్వహించస్తామన్నారు. వివరములకు ఫోన్ నెం.99897 83033 సంప్రదించాలని అన్నారు. అలాగే 15న చోడవరం గవర్నమెంట్ హై స్కూల్ లో కబడ్డీ, త్రో బాల్, షటిల్ బ్యాడ్మింటన్ జరుగుతాయని, వీటి వివరాలకు నెం. 82472 41666 సంప్రదించాలి అన్నారు. 16న గోవాడ హై స్కూల్ లో అథ్లెటిక్స్, టెన్నీకాయిట్, బాల్ బ్యాడ్మింటన్ జరుగుతాయని, వివరములకు 99082 47767లో సంప్రదించండి అని తెలిపారు. ఈ పోటీల్లో ఇదే మండలంలో చదువుతున్న విద్యార్థులు, 01.01.2010 తేదీ లేదా తర్వాత పుట్టిన వారు, 01.01.2007 తేదీ లేదా తర్వాత పుట్టిన వారు, 14 సంవత్సరములు, 17 సంవత్సరముల విభాగంలో నిర్వహిస్తామన్నారు. ఆటల పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఎంట్రీ ఫారం నింపి పైన తెలిపిన ఫోన్ నంబర్ లలో ఉపాధ్యాయులను కలవాలన్నారు.

సీలేరు, దారకొండలో కుండపోత వర్షం

విశాలాంధ్ర - సీలేరు:జికేవీధి మండలం సీలేరు, దారకొండలో మంగళవారం ఏకధాటిగా ఐదు గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. కురిసిన భారీ వర్షానికి సీలేరు, దారకొండల్లో వర్షపు నీరు ప్రధాన రహదారిపై నుంచి ప్రవహించింది. దారకొండ కొంగపాకల మధ్య కొండ పాకల వాగు, చాకిరేవుగెడ్డ వర్షం ధాటికి ఉధృతంగా ప్రవహించాయి. ఉదయం నుంచి వర్షం కుండపోతగా కురుస్తుండటంతో జనజీవనానికి తీవ్ర అంతరాయం కలిగింది.